క్లుప్తంగా

నేడు బోయలపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: మండలంలోని బోయల పల్లె గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ నూతన భవనాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభిస్తారని, అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వపరంగా లబ్ధిపొందిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, బోయలపల్లి సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

అర్హులందరికీ ఓటు హక్కు



పుల్లలచెరువులో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ దాసు

పుల్లలచెరువు: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ దాసు అన్నారు. కలెక్టర్ ఆదేశాలపై మండలంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కే దాసు మండలంలోని కొమరోలు, రాచకొండ, ఉమ్మడివరం గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరైనా చేర్పులు, మార్పులు చేయాలనుకుంటే ఫారం 6, 7, 8 లను ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమీపంలోని బీఎల్వోకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

పొదిలి రూరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పొదిలి నిర్మమహేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం 10 దివ్యాంగులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సరుకులకు అవసరమైన విరాళాన్ని కల్లం సుబ్బారెడ్డి, ఎస్. నూర్జహాన్, ఎస్. ప్రదీప్, పి. మహేష్‌బాబు, రావూరి చెంచయ్య, మువ్వల పార్థసారధి, పి. భిక్షాల్ రెడ్డి, బండి ఓబుల్ రెడ్డి, నరసింహారావు, చల్లారాఘవరెడ్డి అందించారు. సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జి. శ్రీనివాసులు, వినోదు, బండి అశోక్, ఎద్దు నగేష్, రోటి బ్రదర్స్, యక్కలి శేషగిరి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగులో జాగ్రత్త



వేములకోటలో పంటలను పరిశీలిస్తున్న హెచ్ఓ రమేష్

మార్కాపురం రూరల్: తుఫాను హెచ్చరికల కారణంగా ఉద్యాన పంటల్లో తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన అధికారి డి. రమేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వేములకోటలో పంటలను పరిశీలించారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలన్నారు. వర్షం ఆగిన వెంటను 19-19-19 లేదా 13-0-45 లేదా యూరియా వంటి పోషకాలను పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో నీరు నిల్వ ఉండటం వలన ఎండుతెగులు ఆశించే ప్రమాదం ఉందన్నారు. ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు ఆశించే ప్రమాదం ఉందని, సలహాలకు ఆర్బీకేలో కానీ, తనకు గానీ ఫోన్ చేయాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనాలి

తర్లుపాడు: క్రీడల ద్వారా గ్రామ స్థాయి నుంచి ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడం, యువతలో ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్. నరసింహులు ఆదివారం తెలిపారు. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. 15 సంవత్సరాల వయసు పైన ఉన్న ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

బీజేపీ నాయకుల సంబరాలు

గిద్దలూరు రూరల్: భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు స్థానిక బీజేపీ నాయకులు పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌లో ఆదివారం టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించినందుకు గాను స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. డాక్టర్ జేవీ నారాయణ, రామాజంనేయులు, చంద్రమోహన్, కాసులు పాల్గొన్నారు.



కురిచేడు: శివలింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కంభం చెరువుపై శివాభిషేకంలో పాల్గొన్న భక్తులు



వనభోజనాల్లో పాల్గొన్న బ్రాహ్మణులు

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన

కురిచేడు: కార్తీక మాసం సందర్భంగా మండల బ్రాహణ సంఘం ఆధ్వర్యంలో 29వ లక్ష బిల్వార్చన కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి బ్రాహ్మణులు, వేదపండితులు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో శ్రీ కాళహస్తీశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన కార్యక్రమం వేదపండితుల వేద మంత్రోచ్చరణతో నిర్వహించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ పరిసర గ్రామ ప్రజల గ్రామదేవత అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలతో పాటు వేములకోట, సీతనాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల నుంచి భక్తులు కుంకుమ బండ్లు కట్టుకుని వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళ భక్తులు అమ్మవారికి చీర, గాజులను సమర్పించారు. సమీపంలో ఉన్న నాగ శిలలకు, నాగమయ్య పుట్టకుపాలుపోసి పూజలు చేశారు. ఈవో ఈ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు.



కురిచేడు: శ్రీ జ్ఞానప్రసూనాంబ మాత మూల విరాట్



మార్కాపురం: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

కంభం: కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై కార్తీక వన భోజన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 58 మంది దంపతులతో శివాభిషేకం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ కమ్మ సంఘీయులు ఐక్యమత్యంగా ఉండి సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలన్నారు. ముప్పవరపు వెంకట్రావు, చప్పిడి మధు, సత్యనారాయణ, సురేష్, రమేష్, గని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మీ, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి భక్తులు 3 చీరలు బహూకరించారు. ఆలయ ఆదాయం 3150 రూపాయలు వచ్చినట్లు ఈఓ కార్తీక్ తెలిపారు. భక్తులు సోమయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్ఏ శ్రీనివాసరావు భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా బ్రాహ్మణ కార్తీక వన భోజనాలు

మార్కాపురం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణశివార్లలోని గంగా పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర దేవస్థానంలో కార్తీక బ్రాహ్మణ వన భోజనాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. నిర్వాహకులు ఓరుగంటి సుబ్రమణ్యం, శివుడు, వెలుగొండ ప్రాజెక్టు డిప్యూటీ తహసీల్దార్ రమణ, ఎస్. శాస్త్రి, హరిప్రసాద్, కమలపూరి శ్రీనివాస్, కె. మయి, డి. మధు తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు.

అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లెలో అంకాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించి.. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సంకల్పయాత్రలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో సాయికుమార్

యర్రగొండపాలెం: కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో బి.వి.ఎన్.సాయికుమార్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం-1లో ఆదివారం నిర్వహించిన వికసిత సంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉజ్వల పథకం ద్వారా రేషన్‌కార్డు ఉన్న వారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు అందచేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కోటనాయక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



దొనకొండ: సంక్షేమ పథకాలు వివరిస్తున్న వలంటీర్లు, గృహ సారథులు

దొనకొండ: మండలంలోని చందవరం ఎంపీటీసీ బందారు రాజు ఆధ్వర్యంలో సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంక్షేమ పథకాలను వివరించారు. మరలా మనందరం కలిసికట్టుగా జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని వారు కోరారు. మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య ఆదేశాల మేరకు ఇంటింటికి తిరిగి ప్రజా మద్దతు కోరినట్లు వారు తెలిపారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



పుల్లలచెరువులో రేషన్ పంపిణీ తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ఎండీయూలు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ దాసు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రేషన్ పంపిణీని తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు అందజేసే రేషన్ ఇంటింటికీ వెళ్లి సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వ సమయాల ప్రకారం పంపిణీ చేయాలని ఆపరేటర్లను ఆదేశించారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

మార్కాపురం: అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ కోరారు. ఆదివారం స్థానిక రెడ్డీ మహిళా కళాశాలలో మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల స్కీమ్‌వర్కర్ల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రిటైరైన వారికి 5 లక్షల రూపాయల నగదుతోపాటు జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ స్కీమ్ వర్కర్లకు వర్తింపచేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, ఉపాధ్యక్షుడు రూబేన్, ఎం. బాలమ్మ, ప్రభావతి, సుబ్బలక్ష్మి, మల్లీశ్వరి, ముంతాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఉపకరణాలు అందిస్తున్న గోపాల్‌రెడ్డి, శేఖర్ తదితరులు

మార్కాపురం: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం వికలాంగుల దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అర్హులైన అందరికీ పింఛన్లు వస్తున్నాయనీ ఎవరైనా రానివారుంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పలువురు దివ్యాంగులకు ఉచితంగా వాకర్లు, హ్యాండ్ స్టిక్స్ అందించారు. కాగా 20 మంది దివ్యాంగులు తమకు కిట్లు కావాలని కంప్యూటర్ శిక్షణ ఇప్పించాలని 30 మంది, బస్సుపాసులు ఇప్పించాలని 5 మంది, పింఛన్లు సమస్యపై 15 మంది అర్జీలు ఇచ్చారని ఆయన తెలిపారు. ఎల్. శేఖర్, ఎస్‌వీ రమణారెడ్డి, వెంకటరమణ, అశోక్, బాలచంద్రుడు, ఇసాక్, ఎలీషాబాబు, వెంకటరామయ్య, సుబ్బారెడ్డి, కరుణయ్య పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచి పెట్టారు.

త్రిపురాంతకేశ్వర స్వామికి వెండి నామం



వెండి నామాలతో త్రిపురాంతకేశ్వరుడు



ప్రత్యేకంగా తయారు చేయించిన నామం

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయానికి వెండి నామాన్ని భక్తుడు పవన్ కుమార్ శాస్త్రి అందజేశారు. త్రిపురాంతకం త్రిపురాంతకేశ్వరస్వామికి అలంకరించే జాతి రాళ్లతో పొదిగిన వెండి నామాన్ని శృంగేరి పీఠం మహాస్వామి ఆశీస్సులతో దీనిని ప్రత్యేకంగా తయారు చేయించి అందించినట్లు పవన్‌కుమార్ శాస్త్రి తెలిపారు. ఈ ఆభరణానికి సంప్రోక్షణ చేసి విశేష అభిషేకం అనంతరం స్వామికి అలంకరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



తర్లుపాడులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు

తర్లుపాడు: తర్లుపాడులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ విజయకుమార్ మాట్లాడుతూ లోకరక్షకుడు యేసు అని ఆయన బోధించిన శాంతి, దయ, ప్రేమ ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. యేసు బోధనలు పాటిస్తే సమాజంలో అందరూ సంతోషంగా, శాంతంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరి పట్ల ద్వేషం వీడి ప్రేమను పంచాలన్నారు. లోక రక్షణ కోసం యేసు క్రీస్తు భూమిపై జన్మించిన దేవుడని రెవరెండ్ గుర్రం శేఖర్ అన్నారు. క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేకును ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి కట్ చేసి పంచారు. బర్నబాసు, రాహేలమ్మలు పలువురికి దుస్తులు అందించారు. పాస్టర్ దంపతులకు సర్పంచ్ పి. వరాలు, ఎబినేజర్, రాజకుమారిలు నూతన వస్త్రాలు అందించారు. పి. కొండయ్య, కె. యేసు, ఎం. పుల్లారావు, ఎం. యేసులు, పి. చిన్న యహోషువా, జి. చిన్న పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ పంపిణీ



ఆసుపత్రిలో పెన్షన్ అందుకుంటున్న విల్సన్

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇడుపులపాడు సచివాలయ పరిధిలో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న వ్యక్తికి వలంటీర్ నూతలపాటి రాజేష్ ఆదివారం పెన్షన్ అందజేశాడు. విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్న నూతలపాటి విల్సన్‌కు హాస్పిటల్‌కు వెళ్లి రాజేష్ పెన్షన్ అందజేశాడు. సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి వలంటీర్‌లను పెట్టి తన లాంటి వ్యక్తులకు పెన్షన్ అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని విల్సన్ అన్నారు.

భూ కబ్జా చేయలేదు



దాక్యుమెంట్లు చూపుతున్న సిరాజ్

మార్కాపురం టౌన్: తాను ఎవరి పొలాన్ని కబ్జా చేయలేదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మొఘల్ సిరాజ్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గోగులదిన్నెలో మందటి శివారెడ్డి పొలాన్ని ఆక్రమించినట్లుగా తనపై దురుద్దేశంతో పోలీసు కేసు పెట్టారని ఇందులో వాస్తవం లేదని తెలిపారు. ఆ పొలాన్ని తాను చట్టబద్ధంగానే కొనుగోలు చేశానని ఎక్కడా భూమిని ఆక్రమించలేదని, దౌర్జన్యానికి పాల్పడలేదని తెలిపారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తనపై తప్పుడు కేసు పెట్టారని సిరాజ్ తెలిపారు. శివారెడ్డి అనే వ్యక్తి తనకు తెలియదని ఎప్పుడూ కలవలేదని, కానీ తన భూమి అంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తన వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, పోలీసు విచారణలో వాస్తవాలు తెలుస్తాయన్నారు.

సాగర తీరాన రోటరీక్రీడా మహోత్సవం

చీరాల అర్బన్: రామాపురం బీచ్‌లో పెరల్ రిసార్ట్స్‌లో ఆదివారం రోటరీ జిల్లా స్థాయి సాగరతీర క్రీడా మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి ప్రారంభించారు. ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన కార్యక్రమం రాత్రి వరకు ఆట, పాటలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సాగింది. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు, లక్కీడిప్‌లో గెలుపొందిన వారికి కూడా బహుమతులు అందించారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, జివై ప్రసాద్, డివి సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్ రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.